
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
సోమవారం 22 జనవరి 2024





గౌరాయపల్లి దారిలో నిలిచిన వాహనాలు



ఎల్లమ్మతల్లికి ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు



మల్లన్న ఆలయ ఆవరణలో భక్తజనసందోహం



ఎల్లమ్మతల్లికి పట్నంవేసి కల్యాణం చేస్తున్న భక్తులు



బోనాలు పూదిస్తున్న భక్తులు

మల్లన్నకు పట్నం భక్తుల పబ్బతి

హోరెత్తిన పట్నంవారం

- భక్తజనసంద్రంగా ఆలయ పరిసరాలు
- బోనాలు, పట్నాలతో దండిగా భక్తుల మొక్కులు
- దేవదేవుల నామస్మరణతో మార్మోగిన కొమురవెల్లి



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు





మల్లన్నకు హారతినిస్తున్న అర్చకుడు

చేర్యాల, జనవరి 21: కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జునస్వామికి పట్నం భక్తులు పబ్బతి పట్టారు. మదినిండా మల్లన్న నామస్మరణతో పాటు డప్పు చప్పుళ్ల దరువుల నడుమ శివ శక్తుల సిగాలు, పూనకాలు, పోతురాజుల చిందులతో కొమురవెల్లి విజయాచల గుట్టలు హోరెత్తాయి. మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చిన మొదటివారాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్నంవారాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా హైదరాబాద్‌కు చెందిన సుమారు లక్షమంది భక్తులు తరలిరావడంతో కొమురవెల్లి జనసంద్రంగా మారింది. శనివారం సాయంత్రం ధూళిదర్శనం చేసుకున్న భక్తులు ఆదివారం దండిగా మొక్కులు తీర్చుకున్నారు. భక్తిప్రపత్తులతో బోనాలు తయారుచేసి నైవేద్యాన్ని నివేదించారు. బస చేసిన ప్రాంతంలో, ఆలయ గంగిరేగుచెట్టు ప్రాంతంలో, ముఖమండపంలో మల్లన్నకు చిలుకపట్నం, నజరు, ముఖమండప పట్నాలువేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని చీర, సారెలతో ఒడిబియ్యం పోశారు. తమ కోర్కెలు నెరవేర్చమని గంగిరేగుచెట్టుకు ముడుపులుకట్టారు. సంతానం కలిగించాలంటూ మహిళలు వల్లుబండ వద్ద వరంపట్టారు.

ఎల్లమ్మకు బోనాలు

స్వామివారి సహోదరి అయిన ఎల్లమ్మ దేవతకు బోనాలు నివేదించారు.



బోనాలను తీసుకెళ్తున్న శివసత్తులు

డప్పుచప్పుళ్ల నడుమ సిగాలతో శివమెత్తుతు ఎల్లమ్మతల్లి నామస్మరణతో గుట్టపైకి ఎక్కారు. అమ్మవారికి బోనాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. బెల్లంపానకం, కల్లును నైవేద్యంగా సమర్పించారు.

క్యూలైన్లలో పడిగాపులు

భారీగా భక్తులు హాజరవడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. పట్నాల మందిరంలోని క్యూలైన్లు నిండిపోయాయి. గంటల తరబడిగా క్యూలైన్లలో పడిగాపులు కాశారు. ఆలయ ఈవో బాలాజీ, పునరుద్ధరణ కమిటీ సభ్యులు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ పర్యవేక్షణలో చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

నేడు పెద్దపట్నం, అగ్నిగుండాలు

ఆలయ తోటబావి ప్రాంగణంలో నేడు హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం రచించి అగ్నిగుండాలు దాటనున్నారు. వంటినిండా పసుపు ధరించి భక్తులు పట్నంతొక్కి అగ్నిగుండాలలో చిందేయనున్నారు.

భక్తులకు తప్పని తిప్పలు

- బిందెకు రూ.20, డబ్బాకు రూ.50 చొప్పున నీళ్లు కొనుగోలు
- రూ.40కు కొబ్బరికాయల విక్రయం
- విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు
- కానరాని పారిశుధ్య చర్యలు

7 లో..

పొట్లపల్లి ఆలయంలో మంత్రి పొన్నం పూజలు



పొట్లపల్లి ఆలయంలో కోడెను కట్టేసి మొక్కు తీర్చుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్, జనవరి 21 : హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. కోడెను కట్టేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఈవో, పూజారులతో మట్లాడారు. శివరాత్రి జాతరకు సంబంధించి ముందస్తుగా చర్యలు చేపట్టాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆలయాధికారులు మంత్రి పొన్నంకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవసాని సుశీల, వైస్ఎంపీపీ దేవసాని నిర్మల, అక్కు శ్రీనివాస్, కర్ర రవీందర్ రెడ్డి, మార్క అనిల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



“మద్దూరు మండలంలోని ఓ గొల్లకుర్మ కుటుంబానికి సబ్సిడీ ద్వారా 21 గొర్రెలు పంపిణీ చేసినట్లు రికార్డుల్లో ఉంది. కానీ వారి వద్ద ప్రస్తుతం ఒక్క గొర్రె కూడా లేదు. పేరుకు మాత్రమే వీరు లబ్ధిదారులుగా ఉన్నారు.' ఇలాంటి కుటుంబాలు జిల్లావ్యాప్తంగా వేలల్లో ఉన్నాయి. ఒక్క మద్దూరు మండలంలోనే కాదు జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో కూడా గొర్రెల పంపిణీపై అనేక ఆరోపణలు నెలకొన్నాయి. అందుకే ఈ పథకంపై విచారణ చేపట్టడానికి ఉన్నతాధికారులు దృష్టిసారించారు.



గొర్రె.. గొర్రె ఎక్కడున్నావ్!

- గొర్రెల పంపిణీపై విచారణకు సిద్ధం
- జిల్లాలో 17వేల మందికి మంజూరు
- మొదటి, రెండో విడతల్లో అధికారులు, దళారుల చేతివాటంపై ఆరోపణలు!
- గొర్రెల రీసైక్లింగ్‌పై క్షేత్రస్థాయిలో ఆరా
- లబ్ధిదారుల వివరాల ప్రకారం పరిశీలన

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 21: సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 36,220 గొల్లకుర్మ కుటుంబాలు ఉన్నట్లుగా గత ప్రభుత్వం గుర్తించింది. సొసైటీల్లో సభ్యులుగా ఉన్నవారందరినీ గొర్రెల పంపిణీ పథకానికి అర్హులుగా తేల్చారు. ప్రతీ సభ్యుడికి 20 గొర్రెలు, ఒక గొర్రె పొట్టేలును ఒక యూనిట్‌గా సబ్సిడీ ద్వారా ఇవ్వడానికి నాటి ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో 15,720 మందికి, రెండో విడతలో 16,900 మందికి గొర్రెల యూనిట్లను మంజూరు చేసేలా చర్యలు చేపట్టింది. ఈ పథకానికి అప్పటి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఇదే జిల్లాలోని కొండపాకలో శ్రీకారం చుట్టారు.

తొలి విడతలో దళారుల దందా

తొలివిడతలో 15,720 మంది గొల్లకుర్మ సభ్యులకు గొర్రెలను పంపిణీ చేయడానికి గత ప్రభుత్వం నిర్ణయించింది. 25 శాతం అంటే రూ.31,250 నగదు చెల్లించి డీడీలు కట్టినవారికి రూ.1.25లక్షల విలువైన 21 గొర్రెల యూనిట్‌ను పంపిణీ చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి గొర్రెలు కొనుగోలు చేయడానికి ఆ నాడు పశువైద్యాధికారులు, లబ్ధిదారులు వెళ్లారు. కానీ అక్కడ గొర్రెలు కొనుగోలు చేసి తీసుకొచ్చిన మరుసటి రోజే దళారులు ప్రవేశించి తక్కువ ధరకు లబ్ధిదారుల వద్ద కొనుగోలు చేసిన పరిస్థితి దాపురించింది. ఇదంతా పలువురు అధికారుల దృష్టికి వచ్చినా చూసీచూడనట్లుగా వ్యవహరించారు. ఇందుకుగాను వారికి ముట్టాల్సిన పైకం ముట్టిందనే ఆరోపణలున్నాయి. ఆంధ్రా గొర్రెలు సిద్దిపేటకు, మళ్లీ సిద్దిపేట నుంచి ఆంధ్రాకు, తర్వాత అక్కడి నుండి ఇక్కడకు ఇలా నిత్యం రీసైక్లింగ్ చేస్తూ దళారులు పెద్ద ఎత్తున గొర్రెల దందా చేశారు. గొల్లకుర్మ కుటుంబాల్లో వృత్తికి దూరంగా ఉన్నవారందరినీ టార్గెట్ చేస్తూ వారికి సంబంధించిన గొర్రెలను తక్కువ ధరకు కొనుగోలు చేశారు. లబ్ధిదారులు చెల్లించిన రూ.31,250 నగదుకు రెట్టింపు నగదు ఇచ్చి మిగితా డబ్బును దళారులు, అధికారులు పంచుకున్నారనే ఆరోపణలు ఆ నాడు వెల్లువెత్తాయి. ప్రస్తుతం తొలి విడత లబ్ధిదారుల ఇళ్లలో సగానికి పైగానే ఈ గొర్రెలు లేనట్లుగా అంచనా వేస్తున్నారు.

రెండో విడత అసంపూర్ణం

తొలి విడత గొర్రెల పంపిణీపై పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తడంతో రెండో విడత గొర్రెల పంపిణీని పకడ్బందీగా చేపట్టే ప్రయత్నం చేశారు. గొర్రెల ధరలు పెరగడంతో ఈసారి లబ్ధిదారులు తమ వాటాగా 25 శాతం రూ.43,750 చెల్లించాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం రూ.1.75 లక్షల విలువైన గొర్రెల యూనిట్‌ను అందజేయాలని భావించింది. రెండో విడత కోసం ఎదురుచూసిన 16,900 మంది గొల్లకుర్మ సభ్యులకు అవగాహన కల్పించినప్పటికీ ఆసక్తి చూపించలేకపోయా రు. లబ్ధిదారుల వాటా నగదు పెరగడంతో మరికొందరు వెనుకంజ వేశారు. ఫలితంగా కేవలం 6,582 మంది మాత్రమే డీడీలు చెల్లించగా 1222 మందికే గొర్రెలు దక్కాయి. ఇంకా 5వేల పైచిలుకు మంది సభ్యులు గొర్రెల కోసం ఎదురుచూస్తున్నారు. రెండోవిడతలో వెటర్నరీ అధికారులను కాకుండా ఇతర శాఖల అధికారులను ఆంధ్రప్రదేశ్‌లో గొర్రెల కొనుగోలుకు పంపించారు. వీరిలో కూడా కొందరు ప్రబుద్ధులు అక్కడి ఏజెంట్లతో సంబంధాలు నెరిపి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. రెండో విడతలోనూ పలుచోట్ల గొర్రెల రీసైక్లింగ్ జరిగిందనే అనుమానాలూ ఉన్నాయి.

గొర్రెల యూనిట్లపై విచారణ

ప్రస్తుతం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గొర్రెల యూనిట్ల పంపిణీపై విచారణ జరుగుతున్నది. సిద్దిపేట జిల్లాలోనూ ఈ పథకంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పలువురు ప్రభుత్వం దృష్టికి, ఉన్నతాధికారులకూ ఫిర్యాదు చేశారు. అయితే త్వరలోనే ఈ పథకంపై విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. ఇప్పటికే గొర్రెల యూనిట్లకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. లబ్ధిదారుల జాబితా ప్రకారం ఈ పరిశీలన సాగనున్నట్లు తెలుస్తున్నది. ఈ జిల్లాకు గొర్రెలను సరఫరా చేయడంలో కీలకంగా వ్యవహరించిన కొందరు ఆంధ్రా ఏజెంట్లపై కూడా ఆరా తీస్తున్నారు. వీరికి అనుకూలంగా ఉన్న జిల్లాలోని అధికారుల బండారం కూడా బయటపడనున్నది. నాటి ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టగా దళారులు, అధికారుల ప్రమేయం వల్ల అభాసుపాలైంది. అందుకే విచారణకు ముందుగానే తమ పొరపాట్లను సరిదిద్దుకునే ప్రయత్నంలో ఉన్నట్లు చర్చ జరుగుతున్నది.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

- ఆదాయం, ఖర్చు వివరాల నివేదిక కోరిన కేంద్రం
- ఈ నెల 27లోపు సిద్ధం చేయాలని ఆదేశం

మెదక్ అర్బన్, జనవరి 21: జాతీయ స్థాయి ప్రజా ప్రణాళిక కార్యక్రమం కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక సంఘం నిధులు వస్తాయి. వాటితోపాటు పంచాయతీలకు ఏయే మార్గాల ద్వారా ఆదాయం వస్తుంది? వచ్చిన ఆదాయాన్ని ఎలాంటి పనులకు ఖర్చు చేస్తారు.. అనే వివరాలతో పాటు తొమ్మిది అంశాల్లో ప్రణాళికలు సిద్ధం చేసి పంపించాలని కేంద్రం నిబంధన పెట్టింది.

ప్రత్యేకంగా తొమ్మిది అంశాలు

అభివృద్ధి ప్రణాళిలో తొమ్మిది అంశాలు ప్రవేశపెట్టింది. పేదరికం లేకుండా మెరుగైన జీవనోపాధి, పచ్చదనం-పరిశుభ్రత, పంచాయతీలకు సరిపడా నీరు, స్వయం సమృద్ధి, సామాజిక భద్రత, అందరూ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు, బాలల స్నేహపూర్వకం, మహిళ సాధికారత, పంచాయతీలో సుపరిపాలన, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలు రూపొందించారు. ఇందులో పంచాయతీలకు అవసరమైన ఏవైనా రెండు అంశాలు తీసుకొని వాటికి ప్రత్యేకంగా బడ్జెట్ రూపొందించుకోవాలి.


కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘంతో పాటు రాష్ట్ర సర్కార్ నిధులతో గ్రామాల్లో పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళిక అవసరం ఉంటుంది. గ్రామాల్లో ఎలాంటి పనులు కావాలి.; వాటికి నిధుల అంచనా. వంటివి రూపొందించాలి. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీకి పంచాతీయ కార్యదర్శి నోడల్ అధికారిగా వ్యవహరించున్నారు మండల స్థాయిలో పూర్తయిన తర్వాత జిల్లాస్థాయిలో ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలి. ఈ నెల 27 నాటికి గ్రామ సభలు పూర్తి చేయాలి. ఈనెల 31 నాటికి ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.



జై శ్రీరామ్..

నేడు అయోధ్యలో రాముని విగ్రహం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో ధర్మ కార్య ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాముని విగ్రహంతో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మోహినిపుర వేంకటేశ్వర ఆలయం నుంచి విక్టర్ టాకీస్ చౌరస్తా మీదుగా పాత బస్టాండ్ , సుభాష్ రోడ్డు, మార్కెట్ ఎక్స్ రోడ్డు నుంచి వైశ్య భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు, హిందూ కార్యకర్తలు పాల్గొని నృత్యాలు, ఆటపాటలతో అలరించారు.

- సిద్దిపేట క్రైం, జనవరి 21



చిప్పల్‌తుర్తి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

నర్సాపూర్, జనవరి 21: నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి సమీపంలోని ఆశ్రమంలో ఆదివారం మహారాష్ట్రకు చెందిన ప్రముఖ గురువు శ్రీకృష్ణ నందాజి మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విద్యుదాఘాతంతో కూలీ మృతి

శివ్వంపేట, జనవరి 21: విద్యుదాఘాతంతో కూలీ మృతిచెందాడు. మండల పరిధిలోని చండికి చెందిన మల్లేశ్(46) గ్రామానికి సమీపంలోని మల్యతండా వద్ద విత్తన పరిశ్రమలో కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం కూలీకి వెళ్లిన మల్లేష్ పరిశ్రమలోని బోర్లు నడవకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి మరమ్మతు చేసేందుకు యత్నించాడు. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

● లంబాడ హక్కుల పోరాట సమితి


మాట్లాడుతున్న లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు

నారాయణఖేడ్, జనవరి 21: అవినీతిని ప్రశ్నించినందుకు లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్‌పై తప్పుడు కేసులు నమోదు చేయడం సరికాదని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రాథోడ్ అన్నారు. నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాది కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి అవినీతి అక్రమాలపై రాజేష్‌నాయక్ ప్రశ్నించడంతో అతనిపై కేసులు పెట్టిస్తున్నారన్నారు. ఇన్‌చార్జిగా కొనసాగుతూ అనేకరకాలుగా అవినీతికి పాల్పడుతున్నారని, అందువల్ల అక్రమాలపై బహిరంగ చర్చకు వచ్చి నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనుల ఆరోగ్యాలు, హక్కులను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. త్వరలో సీఎంను కలిసి అక్రమాలపై వివరించనున్నట్లు ప్రకాష్‌రాథోడ్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, నాయకులు మోహన్‌రాజు, వినోద్, రవి, పాల్గొన్నారు.

లేగ దూడపై అడవి జంతువు దాడి


మృత్యువాతపడిన ఆవు దూడను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కౌడిపల్లి, జనవరి 21: లేగదూడపై అడవి జంతువు దాడిచేసి చంపిన ఘటన మండల పరిధిలోని సలవత్‌పూర్‌లో శనివారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి శ్రీశైలం తన వ్యవసాయ పొలం వద్ద ఐదు ఆవులను కట్టేశాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకెళ్లి చూడగా.. లేగదూడపై అడవి జంతు దాడిచేసి చంపితిన్న ఆనవాళ్లు కనిపించాయి. వెంటనే ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలియజేగా.. అటవీశాఖ అధికారి కరీముల్లా, పశువైద్యాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ పరిసర ప్రాంతం రైతులు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. కాగా విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఘటనా స్థలం వద్దకు పెద్దఎత్తున తరలివచ్చారు.













ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ వైష్ణవి - ఆర్.సి.పురం
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
అట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
ఎస్2 సోమ - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్య - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్- అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్


వ్యవసాయ బావుల నుంచి నీటిని కొని తెచ్చుకుంటున్న భక్తులు


వెనకదారి ఆవరణలో ప్లేట్లను పారేసి చేతులు శుభ్రం చేసుకుంటున్న భక్తులు


పట్నం వారంలో భక్తుల నుంచి డబ్బు తీసుకుంటున్న ఒగ్గు పూజారి

మల్లన్న భక్తులకు తప్పని తిప్పలు

● కానరాని పారిశుధ్య చర్యలు ● రూ.40కు కొబ్బరికాయల విక్రయం ● విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు


వ్యర్థాల పారబోతతో రంగుమారిన కోనేరు నీటిలో స్నానం చేస్తున్న భక్తులు

చేర్యాల, జనవరి 21: కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి కల్పిస్తామని, పారిశుధ్య చర్యలను ఎప్పటికప్పుడు ముమ్మరం చేస్తూ స్వచ్ఛతగా తీర్చిదిద్దుతామని సమీక్షా సమావేశాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు గొప్పగా ప్రకటనలు చేసినా పట్నంవారం నిర్వహణలో విఫలమయ్యారు.

బిందెడు నీళ్లకు రూ.20, డబ్బాకు రూ.50

వాహనాలను దూరంలోనే నిలిపివేసి పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటుచేసిన క్రమంలో నీటి వసతికి చర్యలు తీసుకోలేదు. దీంతో భక్తులు దుకాణాలకు, వ్యవసాయ బావులవద్దకు వెళ్లి బిందెడు నీళ్లకు రూ.20, డబ్బాకు రూ.50 చొప్పున కొనుగోలు చేశారు. అలాగే స్నానానికి రూ.20 చొప్పున ఖర్చుచేశామని వాపోయారు.

పనిచేయని మిషన్ భగీరథ నల్లాలు

తాగునీటి కోసం ఆలయ తోటబావి ప్రాంగణంలోని మిషన్ భగీరథ నల్లాలు ఏర్పాటు చేశామని ప్రకటించినా నల్లాలు పనిచేయలేదు. వృథాగా ఉండటంతో భక్తులు వాటిపై దుస్తులు ఆరబెట్టుకున్నారు.

క్యూలైన్లలో తాగునీరు లేక తంటాలు

భక్తుల రద్దీ దృష్ట్యా ధర్మ దర్శనానికి సుమారు 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటలపాటు సమయం పట్టింది. కిక్కిరిసిన క్యూలైన్లలో పడిగాపులు కాయడంతో తాగునీటి కోసం తల్లడిల్లారు. ఆరుబయట క్యూలైన్ల ప్రాంగణంలో నీటివసతి కల్పించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

పారిశుధ్య చర్యలు శూన్యం

స్వామివారి దర్శనానంతరం బయటకు వచ్చే ఆవరణలో పలువురు అన్నదానం నిర్వహించి భక్తుల ఆకలి తీర్చినా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయకపోవడంతో నడకదారిలోనే ప్లేట్లను ఇష్టానుసారం పారబోశారు. అంతేకాకుండా అక్కడే చేతులు శుభ్రం చేసుకోవడంతో చిత్తడిగా మారినా ఆలయవర్గాలెవరూ పట్టించుకోలేదు. పునరుద్ధరణ కమిటీ సభ్యులూ పర్యవేక్షించలేదు. ప్రసాద విక్రయశాల ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఎల్లమ్మగుట్టపై కొబ్బరికాయలు కొట్టే ప్రదేశంలో వృథానీటిని మళ్లింపచేయకపోవడంతో భక్తులు నడిచేదారిలో ప్రవహించడంతో ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ సరఫరాలోనూ అంతరాయం

ఆలయ పరిధిలో పలుమార్లు విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ఎల్లమ్మ దేవతను చీకట్లోనే దర్శనం చేసుకున్నారు. ఉదయం 7 నుంచి తరచూ అంతరాయం ఏర్పడింది. బోర్లు కూడా సక్రమంగా పనిచేయక వసతి గదుల్లో నీళ్ల కోసం నానా తంటాలు పడ్డారు. తోటబావి జనరేటర్ మొరాయించిది.

ఎల్లమ్మ స్వాగతతోరణం వద్ద గజిబిజి

తాత్కాలిక క్యూలైన్లు కిక్కిరిసిపోవడంతో భక్తులు ఎల్లమ్మ ఆలయ స్వాగతతోరణం దాటి ఎండలోనే నిల్చున్నారు. ఎల్లమ్మతల్లికి బోనాలు, ఒడిబియ్యం తీసుకెళ్లేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో క్యూలో నిల్చున్న భక్తుల మధ్యలోంచి వెళ్లడంతో తోపులాట జరిగింది. పోలీసులు కలుగజేసుకుని భక్తులను ఆపి ఎల్లమ్మగుట్టపైకి అనుమతించారు. ఇదిలా ఉండగా రూ.20కు విక్రయించాల్సిన కొబ్బరికాయలను కాంట్రాక్టర్ సంబంధీకులు రూ.40కు విక్రయించారు. అయినా ఆలయాధికారులు చోద్యం వహిస్తుండటంతో భక్తుల జేబులకు చిల్లులుపడ్డాయి.


ప్రసాద విక్రయశాల ఆవరణలో చెత్తాచెదారం


ఎల్లమ్మ ఆలయ ఆవరణలో కొబ్బరికాయల వృథా నీటితో చిత్తడిగా మారిన మెట్లు

నేటి నుంచి కొండపోచమ్మ జాతర

● మూడునెలల ఉత్సవాలకు ఆలయం ముస్తాబు
● భారీగా తరలిరానున్న భక్తులు
● ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు



కొండపోచమ్మ ఆలయం, కొండపోచమ్మ అమ్మవారు

జగదేవ్‌పూర్, జనవరి 21: ప్రజల కోరికలు తీర్చే కల్పవల్లి కొండపోచమ్మ ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. మూడునెలలపాటు అంగరంగ వైభవంగా జాతర కొనసాగుతుంది. తెలంగాణలోనే ప్రసిద్ధి గాంచిన కొండపోచమ్మ ఆలయం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ నర్సాపూర్ గ్రామానికి ఉత్తర దిశలో ఉన్నది. కొండపోచమ్మ జాతర ఉత్సవాలు 22న ప్రారంభమై ఉగాది వరకూ జరుగుతాయి. ఈ జాతరకు హైదరాబాద్, సికింద్రాబాద్‌లతో పాటు ఉమ్మడి వరంగల్, మెదక్, నల్గొండ, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర జిల్లాల నుంచి భక్తుల వేల సంఖ్యలో తరలివస్తారు.

ఆకట్టుకునే లష్కర్ బోనాలు

జాతరకు వచ్చే భక్తులు ఆలయం వద్ద ఉన్న చెరువులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుంటారు. కొత్త కుండలను తీసుకొచ్చి అమ్మవారి బోనాన్ని పసుపు, కుంకుమ, వేప ఆకులతో అలంకరించి ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి ఆటపాటలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల శిగాలతో తీసుకొస్తారు. హైదరాబాద్, సికింద్రాబాద్ భక్తులు తెచ్చే బోనాలు (లష్కర్) ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఆలయం వద్ద అన్ని వసతులు కల్పించామని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, సర్పంచ్ తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్, జనగామ, బస్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఆలయం వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు.

ఉద్యోగం పేరిట నిరుద్యోగ యువకులకు టోకరా

● రూ.1.40 లక్షలు స్వాహా

శివ్వంపేట, జనవరి 21: ఉద్యోగం పేరిట నిరుద్యోగ యువకుల నుంచి ఆన్‌లైన్‌లో రూ.1.40 లక్షలను స్వాహా చేశాడు. శివ్వంపేట మండలం పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన కార్తీక్, దొంతి గ్రామానికి చెందిన జైపాల్ తూప్రాన్‌లో ఐటీఐ చదువుతున్నారు. ఇదే కాలేజీలో చదువుతున్న రామాయంపేట మండలం కాట్రియాల్ తండాకు చెందిన రంజిత్ తోటి విద్యార్థులైన కార్తీక్, జైపాల్‌కు నెలకు రూ.లక్ష వేతనంతో పంజాబ్ రాష్ట్రంలోని అవిన్నో సంస్థలో మార్కెటింగ్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఉద్యోగం కోసం రూ.70 వేలు ఖర్చు వస్తుందని గతేడాది మార్చిలో కార్తీక్, జైపాల్ నుంచి రూ.1.40 లక్షలు ఆన్‌లైన్‌లో పేమెంట్ చేయించుకున్నాడు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడంతో మోసపోయామని గుర్తించిన బాధితులు రంజిత్‌ను నిలదీశారు. మీరు మరికొందరిని చేర్పిస్తే మీ డబ్బులు మీకు వస్తాయని చెప్పాడు. బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాతకక్షలతో యువకుడి హత్య


రవి(ఫైల్)

రాయికోడ్, జనవరి 21: పాతకక్షల నేపథ్యంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. రాయికోడ్ మండల పరిధిలోని సింగితం గ్రామానికి చెందిన కర్బల్ రవి(25) అదే గ్రామానికి చెందిన అలిగే రాజు మధ్య కొన్నిరోజులుగా పాత కక్షలతో గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీహాల్ వద్ద ఆటోలో రవి కూర్చున్నాడు. గమనించిన రాజు తన ఇంటికి వెళ్లి వేట కొడవలి తీసుకొచ్చి రవిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. రవిని వెంటనే చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు జహీరాబాద్ రూరల్ సీఐ నోముల వెంకటేష్ తెలిపారు. కాగా నిందితుడు రాజును ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. మృతుడి తమ్ముడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్, కుంగ్‌ఫూలో ప్రణతికి సిల్వర్ మెడల్


సిల్వర్ మెడల్ చూపుతున్న ప్రణతి

సంగారెడ్డి అర్బన్, జనవరి 21: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఆదివారం జరిగిన ఖేలో ఇండియా ఉమెన్ కిక్ బాక్సింగ్, కుంగ్‌ఫూ పోటీల్లో సంగారెడ్డికి చెందిన సీహెచ్.ప్రణతి జాతీయ స్థాయిలో తలపడి రెండో స్థానం దక్కించుకుని సిల్వర్ మెడల్ సాధించింది. పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ప్రణతి రెండు క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచింది. ప్రణతి సిల్వర్ మెడల్ సొంతం చేసుకోవడం పట్ల మాస్టర్ పోచయ్య, తల్లిదండ్రులు నాగరాజు, రాణి, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

నిబంధనల ప్రకారం అమ్మకాలు చేపట్టాలి


జహీరాబాద్ పట్టణంలోని ఓ మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

జహీరాబాద్, జనవరి 21: మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు చేపట్టాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రజిత పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని పలు మద్యం దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. దుకాణాల తనిఖీల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మద్యం దుకాణాల నిర్వాహకులు రికార్డుల నిర్వహణ, కొనుగోళ్లు, అమ్మకాలు తదితర వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని తెలిపారు. మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్ట్‌షాపుల నిర్వహణ విషయం తమ దృష్టికి వచ్చిందని, వాటిని తొలగించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆయా దుకాణాలకు మద్యం ఎక్కడి నుంచి వచ్చిందని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ అనిల్, సిబ్బంది అనిల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ధ్వంసం


దుండగులు ధ్వంసం చేసిన హుండీ తాళం

తూప్రాన్, జనవరి 21: ఆలయ హుండీ తాళం పగులగొట్టి చోరీకి ప్రయత్నించారు. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ శివారులోని రామప్పగుట్టపై వెలసిన స్వయంభూ శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద హుండీ ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి గుర్తుతెయని దొంగలు చొరబడి హుండీ తాళం పగులగొట్టారు. మూడురోజుల క్రితమే హుండీ లెక్కింపు చేపట్టడంతో నష్టం జరగలేదు. ఇదిలా ఉండగా సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మూడురోజులపాటు జాతర ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలకు సంబంధించి హుండీలో భారీఎత్తున నగదు ఉండవచ్చన్న ఉద్దేశంతో చోరీకి ప్రయత్నించి ఉండవచ్చని చెబుతున్నారు.

ప్రభుత్వ గురుకులాల్లో కార్పొరేట్ స్థాయి విద్య

● ఫిబ్రవరి 11న గురుకులాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష
● 23 వరకు దరఖాస్తుల స్వీకరణ
● సిద్దిపేట జిల్లాలో మొత్తం 2,560 సీట్లు



సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి గురుకుల పాఠశాల

సిద్దిపేటరూరల్, జనవరి 21: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మా జ్యోతి బాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం ఉమ్మడి ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల ద్వారా కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్నది. ప్రస్తుతం నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థులు అడ్మిషన్ పొందేందుకు ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది.

సిద్దిపేట జిల్లాలో మొత్తం 32 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు 16, గిరిజన సంక్షేమ గురుకులాలు 2, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు 8, తెలంగాణ గురుకుల పాఠశాల 1 (జనరల్ పాఠశాలలు), మైనార్టీ గురుకుల పాఠశాలలు 5 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తారు. ఐఐటీ జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, సెంట్రల్ యూనివర్సిటీలు, అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీతో పాటు ప్రముఖ యూనివర్సిటీల్లో అడ్మిషన్స్ పొందేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు హౌస్ మాస్టర్, హౌస్ పేరెంట్ వ్యవస్థ ఉంటుంది. పాఠ్యాంశాలతోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్, యోగా, క్రీడలు, కోడింగ్, ఫైన్ ఆర్ట్స్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణ కూడా ఉంటుంది.

విద్యార్థులకు అందించే సౌకర్యాలు

ప్రతిరోజూ పోషకాహారం అందిస్తారు. ప్లేట్, గ్లాస్, బెడ్ షీట్, బ్లాంకెట్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, రికార్డు బుక్స్, అవసరమైన స్టేషనరీ ఉచితంగా ఇస్తారు. ప్రతి విద్యార్థికీ స్కూల్ యూనిఫాం మూడు జతలు ఇస్తారు. వీటితోపాటు పీటీ డ్రెస్, ట్రాక్ సూట్, స్పోర్ట్స్ షూస్, సాక్స్, నైట్ డ్రెస్, ట్రంక్ బాక్సు కూడా ఇస్తారు. సబ్బులు, షాంపూల కొనుగోలుకు ప్రతి నెల నగదు ఇస్తారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, బీసీ విద్యార్థులు 9 నుంచి 11 మధ్య వయసు ఉండాలి. 2013 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు 9 నుంచి 13 మధ్య వయసు ఉండాలి. కుటుంబ సంవత్సర ఆదాయం రూరల్ విద్యార్థులకు రూ.1.50 లక్షలు, అర్బన్ లేదా పట్టణ ప్రాంతం విద్యార్థులకు రూ.2 లక్షలకు మించకూడదు.

పరీక్ష విధానం

ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నలను మూడు, నాలుగు తరగతుల పాఠ్యాంశాల నుంచి ఇస్తారు. తెలుగు, పరిసరాల పరిజ్ఞానంలో 20, ఇంగ్లీష్, మ్యాథ్స్‌లలో 25, మెంటల్ ఎబిలిటీలో 10 చొప్పున ప్రశ్నలు ఇస్తారు. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో గుర్తించాలి. ప్రశ్నాపత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో ఇస్తారు. పరీక్ష రాసేందుకు 2 గంటల సమయం మాత్రమే ఉంటుంది. ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగానే అడ్మిషన్ ఇస్తారు. రిజర్వేషన్ నిబంధనలు, స్థానికత, ప్రత్యేక కేటగిరీలను పరిగణనలోకి తీసుకుంటారు. విద్యార్థుల ఎంపికలో పాత జిల్లాను ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. రూ.100 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 23 దరఖాస్తుకు చివరి తేదీ కాగా.. ఫిబ్రవరి 11న పరీక్ష ఉంటుంది. పదిరోజుల ముందు నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంటుంది.

పరీక్ష రాయకుంటే అడ్మిషన్ లభించదు

ప్రస్తుతం నాలుగవ తరగతి చదువుతున్న బాలబాలికలు దరఖాస్తు చేసుకుని తప్పక పరీక్ష రాయాలి. పరీక్ష రాయకుండా గురుకుల పాఠశాలలో అడ్మిషన్ లభించదు. గురుకుల పాఠశాలల్లో చదివిన పిల్లలకు బంగారు భవిష్యత్ ఉంటుంది. ప్రభుత్వం పిల్లలకు విద్యాపరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నది. కార్పొరేట్ స్థాయి విద్య కేవలం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో మాత్రమే లభిస్తున్నది. ఈ అవకాశం జిల్లాలోని విద్యార్థులు వినియోగించుకోవాలి.

- కే.నిర్మల, రిజినల్ కో ఆర్డినేటర్, సిద్దిపేట జిల్లా

లద్నూరు రిజర్వాయర్‌కు గోదావరి నీళ్లు



లద్నూరు రిజర్వాయర్‌లోకి వస్తున్న గోదావరి జలాలను పరిశీలిస్తున్న నాయకులు

మద్దూరు, జనవరి 21: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజ్ఞాపన మేరకు మండలంలోని లద్నూరు రిజర్వాయర్‌లోకి గోదావరి నీటిని ఇరిగేషన్ శాఖాధికారులు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సూచన మేరకు ఆదివారం లద్నూరు రిజర్వాయర్‌ను వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, సర్పంచ్ జీడికంటి సుదర్శన్, స్థానిక నాయకులతో కల్పి పైపులైన్ ద్వారా వస్తున్న గోదావరి నీటిని పరిశీలించి మాట్లాడారు. ఇటీవల రైతుల సమస్యపై స్పందించిన జనగామ ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి ఆదివారం నీటిని విడుదల చేయించారని తెలిపారు. లద్నూరు రిజర్వాయర్‌లోకి గోదావరి నీళ్లు వస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రిజర్వాయర్‌ను సందర్శించినవారిలో కాసర్ల కనకరాజు, నంద శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పలు మండలాల్లో రామభక్తుల శోభాయాత్రలు

గజ్వేల్, జనవరి 21: అయోధ్యలో రాంలల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో భక్తులు ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని అంగడిపేట హనుమాన్ ఆలయం నుంచి శివాజీ విగ్రహం, పిడిచెడ్ రోడ్డు, ప్రజ్ఞాపూర్ నుంచి శ్రీకృష్ణాలయం వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణాలయం వద్ద నుంచి అంగడిపేట హనుమాన్ ఆలయం మీదుగా పట్టణంలోని శ్రీసీతా రామ ఉమామహేశ్వరాలయం వరకు శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రజలు, ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు గజ్వేల్‌లో ప్రత్యేక కార్యక్రమాలు

● **గజ్వేల్ రూరల్:** గజ్వేల్‌లో 500 ఏళ్ల చరిత్ర గల శ్రీ సీతారామ ఉమామహేశ్వరాలయ పునర్నిర్మాణ పనులను సుమారు రూ.5 కోట్ల వ్యయంతో ఏడాది క్రితం పూర్తి చేసిన సంగతి తెలిసిందే.



గజ్వేల్, చేర్యాల పట్టణాల్లో బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్న భక్తులు

అయోధ్యలో రాంలల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక అంగడిపేట హనుమాన్ ఆలయం నుంచి రామాలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు శ్రీనివాసు, రాజశేఖర్‌శర్మ ఆదివారం తెలిపారు. అనంతరం శ్రీరాముడికి పంచామృతాభిషేకాలు, డోలోత్సవం తదితర విశేష పూజలు ఉంటాయన్నారు. ఆలయ ఆవరణలో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అయోధ్యలో జరిగే ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ ప్రత్యక్షప్రసారం, అన్నప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.

● **చేర్యాల:** అయోధ్య రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చేర్యాలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రామాలయం నుంచి ప్రధాన వీధులగుండా అభయాంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ, శోభాయాత్ర చేపట్టారు. శోభాయాత్రలో జై శ్రీరాం నినాదాలతో హోరెత్తించారు.



ముంబై మారథాన్‌లో పాల్గొన్న సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు


ముంబై మారథాన్‌లో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు

సిద్దిపేట క్రైం, జనవరి 21: ముంబైలో ఆదివారం నిర్వహించిన మారథాన్‌లో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని 41.195 కె (మారథాన్) పూర్తి చేశారు. సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఇతర రాష్ట్రాలలో జరిగే మారథాన్‌లలో పాల్గొంటూ సిద్దిపేట ఖ్యాతిని దేశవ్యాప్తంగా ఇనుమడింపజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సీసీఎస్ డీసీపీ ఎన్. శ్వేత, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తుల బాపురెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతి రెడ్డి, దుబ్బాక సీఐ కృష్ణ, రన్నర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పరంధాములు, రాజు, వెంకట్, అశోక్, కృష్ణారెడ్డి, జగదీశ్వర్, మహేష్, రవి, నర్సింహులు, రమేష్, విజయ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

డబ్బు కోసం యువకుడి హత్య

● న్యాయం చేయాలంటూ జగదేవ్‌పూర్‌లో రోడ్డుపై కుటుంబీకుల ధర్నా

● పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమణ



రోడ్డుపై బైఠాయించిన బాధిత కుటుంబీకులు

కరుణాకర్(ఫైల్)

జగదేవ్‌పూర్, జనవరి 21: ఈ నెల 18న అదృశ్యమైన యువకుడు స్థానిక చెరువులో మృతదేహంగా మారాడు. పోలీసుల విచారణలో డబ్బు కోసం చేసిన హత్యగా తేలింది. నిందితులు హత్య చేసి మృతుడి వద్ద ఉన్న రూ.30 వేలనగదుతో పాటు సెల్‌ఫోన్‌ను తీసుకున్నారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన ఎర్ర కరుణాకర్(30) ఈ నెల 18న ఇంట్లో నుంచి కూలీ పని నిమిత్తం వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో జగదేవ్‌పూర్‌కు చెందిన స్వామి అనే యువకుడు స్థానిక మద్యం దుకాణం వద్ద మొబైల్ ఫోన్‌ను అమ్మడానికి పెట్టాడు. ఇది గమనించిన వైన్స్ దుకాణాదారుడు పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు స్వామిని అదుపులోకి తీసుకుని విచారించగా కరుణాకర్ హత్యకు గురైన విషయం బయటపడింది. ఈ నెల 18న కరుణాకర్ జగదేవ్‌పూర్‌లోని మద్యం దుకాణం వద్ద మద్యం తాగి సమీపంలో చెట్టు కింద నిద్రపోయాడు. కరుణాకర్ వద్ద డబ్బులు ఉన్న విషయాన్ని గమనించిన జగదేవ్‌పూర్‌కు చెందిన రాగుల గణేష్, కొంపల్లి నాగరాజు అతడి వద్దకు వెళ్లి మచ్చిక చేసుకుని మాట్లాడుతూ మళ్లీ ముగ్గురు కలిసి మద్యం సేవించారు. అనంతరం వారు కరుణాకర్‌తో గొడవకు దిగి గొంతు నులిమి హత్య చేశారు. అతడి వద్ద ఉన్న రూ. 30 వేల నగదుతో పాటు మొబైల్‌ను తీసుకుని, మృతదేహాన్ని పక్కనే ఉన్న రెడ్డమైన చెరువులో పడేసి వెళ్లిపోయారు. పోలీసులు నిందితులిద్దరిని అదుపులో తీసుకుని విచారించగా తామే హత్య చేసినట్టు ఒప్పుకున్నారు. ఆదివారం ఉదయం కరుణాకర్ మృతదేహాన్ని జగదేవ్‌పూర్ చెరువులో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ గ్రామస్థులు కుటుంబసభ్యులతో కలిసి జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న ఏసీపీ రమేష్, సీఐ జానకిరాంరెడ్డిలు ఘటనా స్థలానికి చేరుకుని నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

కారు ఢీకొని యువకుడి మృతి

అల్లాదుర్గం, జనవరి 21: బైక్‌ను కారు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ వద్ద గల 161వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముస్లాపూర్ గిరిజన తండాకు చెందిన ముడావత్ విఠల్(30) బైక్‌పై ముస్లాపూర్ నుంచి తండాకు బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో అల్లాదుర్గం వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీ కొనడంతో విఠల్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్



సంగారెడ్డిలో క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న ఐఎంఏ డాక్టర్లు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలోని ఎంఎస్ క్రికెట్ అకాడమీలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)మంజీర బ్రాంచ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి క్రికెట్ లీగ్ టోర్నమెంట్ సీజన్-4ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో సంగారెడ్డి పట్టణంతో పాటు సదాశివపేట డాక్టర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు టీఎస్ఎంసీ మెంబర్ డాక్టర్ ఆనంద్ తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్, యూరాలజిస్ట్ డాక్టర్ ఎస్.ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ లీగ్ మ్యాచ్‌లో ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ఉషాకిరణ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చక్రపాణి, డాక్టర్లు స్వామిగౌడ్, రాజుగౌడ్, పరమేశ్, నందకుమార్, ఆనంద్‌నాయక్, పరుశురాం, బాబుల్‌రెడ్డి, వెంకట్, హరికుమార్‌గౌడ్, సురేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి

మనోహరాబాద్, జనవరి 21: ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి అని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామంలో సన్‌షైన్ షోటోకాన్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ శిక్షణ అభ్యర్థులకు బ్లాక్‌బెల్టులను ఎస్ఐ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి ఆరోగ్యానికి, ఆత్మ రక్షణకు కరాటే నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 4 జిల్లాలకు చెందిన సుమారు 250 మంది విద్యార్థులు వివిధ గ్రేడ్ల బెల్టులు, సర్టిఫికెట్లను అందుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేఖామల్లేష్, కనిగిరి లింగం, శంకర్, మాస్టర్లు సురేష్, సాయికుమార్, రవీందర్, ఎల్లం, ప్రభాకర్, హరీశ్, విశాల్, పృథ్వీ, రాజేష్, ఉదయ్ స్వామి పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామి ఉత్సవాలు షురూ

శివ్వంపేట, జనవరి 21: మండలంలోని సికింద్లాపూర్ సమీపంలోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ఉత్సవాలను ఆదివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. మూడు నెలల పాటు ప్రతి ఆదివారం నిర్వహించే జాతరకు మండల ప్రజలతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈవో శశిధర్‌గుప్తా, పూజారి ధనంజయశర్మ, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి రెడ్డి, నాయకులు మాదవరెడ్డి, హన్మంతరెడ్డి, మహేందర్‌రెడ్డి,బిక్షపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి



సిద్దిపేట సీపీఎం కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సిద్దిపేట అర్బన్, జనవరి 21: మార్క్సిజాన్ని ఆచరణలో అమలు చేసి శ్రమజీవులను దోపిడీ నుంచి విముక్తి చేసిన గొప్ప మహనీయుడు లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి పేర్కొన్నారు. లెనిన్ 100వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం సిద్దిపేటలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ లెనిన్ విప్లవస్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, రవికుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** కమ్యూనిస్ట్ సిద్ధాంతకర్త లెనిన్ 100వ వర్ధంతిని ఆదివారం చేర్యాలలో సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం

● కార్మిక కర్షక మైత్రి జిల్లా సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

సిద్దిపేట అర్బన్, జనవరి 21: కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేటలో కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా కార్మిక కర్షక మైత్రి జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాల ద్వారా పోరాట ప్రచారాన్ని నిర్వహించి జనవరి 26న జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్ వాహనాల ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పోరాటాలు త్యాగాల ద్వారా తెచ్చుకున్న 29 చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వంపై కార్మికులు కర్షకులు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ పథకానికి నిదులలో కోత పెట్టడం సరికాదని వారు విమర్శించారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె రైతుకూలీ సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ బంద్ నిర్వహించనున్నామని తెలిపారు. సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు భాస్కర్ ,రవికుమార్ ,శోభ, బాల నరసయ్య, రంగారెడ్డి, కనకయ్య, భాస్కర్, శ్రీనివాస్, కనకచారి, రవీందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అసమర్థతతో అసంపూర్తిగా పనులు

● బీజేవైఎం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్ యాదవ్

గజ్వేల్, జనవరి 21: బీఆర్ఎస్ నాయకుల చేతగానితనంతోనే గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని బీజేవైఎం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పాలకవర్గం సమయమంతా కుట్రలు, కుతంత్రాలకే సరిపోయిందని, జరగాల్సిన అభివృద్ధి పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయన్నారు. పనులు నిలిచిపోయేలా చేసిన మాజీమంత్రి హరీశ్‌రావు గజ్వేల్ అభివృద్ధిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సిద్దిపేటతో పోలిస్తే గజ్వేల్‌పై మంత్రి హరీశ్‌రావుది సవతి తల్లి ప్రేమ అని ఆరోపించారు. గజ్వేల్‌లో అభివృద్ధి పనులు ఎన్నో నిలిచిపోయాయని, కోటమైసమ్మ రోడ్డు, యూజీడీ పనులు, సంగాపూర్ రింగ్‌రోడ్డు లింక్ ఎక్కడివక్కడే ఉన్నాయన్నారు. అసంపూర్తిగా ఉన్న రింగ్‌రోడ్డును ప్రారంభించారని, సీసీ రోడ్లు వేయలేదని, కొత్త వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా గజ్వేల్ అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజల కష్టాలను తీర్చాలన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల అవినీతిపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట బీజేపీ నాయకులు కుడిక్యాల రాములు, నత్తి శివకుమార్, గుర్రం శ్రీధర్, హరికృష్ణ, శ్రీకాంత్‌గౌడ్ తదితరులున్నారు.

మర్రిముచ్చాల జీపీ నూతన భవనం ప్రారంభం



జీపీ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

చేర్యాల, జనవరి 21: కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలో ఇటీవల నిర్మించిన గ్రామపంచాయతీ నూతన భవనాన్ని సర్పంచు బొడ్డం పద్మ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యంతో పాటు పౌరసేవలందించేందుకు నూతన భవనం ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. అనంతరం భవన నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా అందించిన వంగ జగన్నాథరెడ్డి, వంగ శివారెడ్డిలను సర్పంచ్ ఎంపీపీ తలారి కీర్తనతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడిని పరామర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్

చేర్యాల, జనవరి 21 : ఇటీవల ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడు భూమిగారి మల్లేశం గాయాలపాలై సిద్దిపేటలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి బాధితుడిని పరామర్శించి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు.

మృతుడి కుటుంబానికి శివాజీ యూత్ ఆర్థికసాయం

మద్దూరు, జనవరి 21 : మద్దూరు మండలం సలాఖ్‌పూర్ గ్రామానికి చెందిన బియ్య నర్సింహులు కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. గ్రామంలోని శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నర్సింహులు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు యూత్ తరపున అండగా ఉంటామని తెలిపారు.



నాణాలతో అయోధ్య రామ మందిర చిత్రాన్ని ఆవిష్కరించిన దృశ్యం

20 వేల నాణాలతో అయోధ్య రామ మందిర చిత్రం

గజ్వేల్ రూరల్, జనవరి 21: శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డు గ్రహీత, రామకోటి రామరాజు ఆదివారం గజ్వేల్‌లోని కార్యాలయంలో 20 వేల నాణాలతో 10 అడుగుల పొడవు 8 అడుగుల వెడల్పుతో అయోధ్య రామ మందిర చిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో రాం లల్లా ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం భక్తులు తమ ఇంటిలో ప్రత్యేక పూజలు చేసి దీపాలు వెలిగించాలని కోరారు. అదేవిధంగా స్థానిక శ్రీమురళీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జనవరి 21 : హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం క్యాలెండర్, డైరీని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. పాఠశాలల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రంగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సింగసారం వెంకటయ్య, బండారి మనీల, చంద్రశేఖర్, చీకోటి మహేశ్వర్, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగపల్లి వెంకటనర్సయ్య తదితరులున్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతి ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న వి నెట్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రజిత

హుస్నాబాద్, జనవరి 21: సంక్రాంతి పండుగ సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలో ఎన్ఆర్ఐ వి నెట్ రఘు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలైన మహిళలకు ఆదివారం బహుమతులను ప్రదానం చేశారు. భోగి, సంక్రాంతి పండుగ సందర్భంగా ఇళ్ల ముందు వేసిన ముగ్గుల్లో 150 మంది మహిళలను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వి నెట్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ గంగం రజిత, గాంధీ, ఫౌండేషన్ సభ్యులు గూడూరి భూమయ్య, కోడం రమేశ్, హేమలత, రాగి కవిత, పున్న రాజమౌళి, న్యాయ నిర్ణేతలు చిట్టి గోపాల్‌రెడ్డి, రమాదేవి తదితరులున్నారు.

పద్మశాలీ సమాజం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

సిద్దిపేట అర్బన్, జనవరి 21: సిద్దిపేట పద్మశాలీ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలో మార్కండేయ ఆలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ మమతారెడ్డి తోపాటు సిద్దిపేట పట్టణ పద్మశాలీ సమాజం అధ్యక్షుడు కాముని రాజేశం, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, కోశాధికారి శ్రీనివాస్ ఉపాధ్యక్షులు అశోక్, శ్రీహరి, సహాయ కార్యదర్శి గుండు రవితేజ, కార్యవర్గ సభ్యులు బాలరాజు, ప్రసాద్, శ్రీనివాస్, విశ్వా హాస్పిటల్ ప్రతినిదులు సాయి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గజ్వేల్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం: డీసీసీ అధ్యక్షుడు



తిగుల్‌నర్సాపూర్ సర్పంచ్ రజితారమేష్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

జగదేవ్‌పూర్, జనవరి21: గజ్వేల్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందని డీసీసీఅధ్యక్షుడు నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తిగుల్‌నర్సాపూర్ గ్రామ సర్పంచ్ రజితారమేష్‌తో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు సుమారు వంద మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి నర్సారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి కంటే అవినీతే ఎక్కువ జరిగిందన్నారు. పేదలసంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడురవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కొండపోచమ్మ మాజీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీటీసీలు మహేష్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, మంజులామహేందర్‌రెడ్డి, నాయకులు లక్మారెడ్డి, వెంకటస్వామి, అశోక్, శ్రీనివాస్, అజిత్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ఎన్నిక



హుస్నాబాద్ ఆర్యవైశ్య సంఘ కార్యవర్గం

హుస్నాబాద్ టౌన్, జనవరి 21 : హుస్నాబాద్ పట్టణ ఆర్య వైశ్య సంఘం కార్యవర్గ ఎన్నికలు ఆదివారం వైశ్యభవన్‌లో జరిగాయి. సంఘం గౌరవ అధ్యక్షుడిగా చొల్లేటి శంకరయ్య, అధ్యక్షుడిగా కొత్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గౌరిశెట్టి రాజు, కోశాధికారిగా బబ్బుల రవీందర్‌తో పాటు మహిళా విభాగం, యువజన విభాగాల కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా తనుకు అంజనేయులు, బెజుగం శ్రీనివాస్, ఎన్నికల పరిశీలకులుగా గంప శ్రీనివాస్, అయిత రత్నాకర్ వ్యవహరించారు.

ఆటలతో యువతలో క్రీడాస్ఫూర్తి: సునితారెడ్డి



క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునితారెడ్డి

నర్సాపూర్, జనవరి 21: క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. నర్సాపూర్ జూనియర్ కాలేజీ మైదానంలో సుల్తాన క్రికెట్ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతా రెడ్డి హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడా పోటీలతో యువతలో దాగి ఉన్న నైపుణ్యం బయటపడటంతో పాటు మానసిక ప్రశాంతతకు, ఆరోగ్యానికి దోహదపడుతాయన్నారు. క్రమశిక్షణ, స్నేహం కూడా అలవడుతుందని తద్వారా ప్రేమ ఆప్యాయతలు పెరుగుతాయని చెప్పారు. క్రీడాపోటీలు నిర్వహించిన వారిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నయీముద్దీన్, కౌన్సిలర్ అశోక్‌గౌడ్, నాయకులు శేఖర్, సత్యం గౌడ్, భిక్షపతి, బాల్‌రెడ్డి, మహ్మద్, లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ఇద్దరి అదృశ్యం



అదృశ్యమైన గంసిబాయి, హిరామన్

సంగారెడ్డి క్రైం, జనవరి 21: సంగారెడ్డి పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన రాథోడ్ గంసిబాయి(36) శనివారం కూలీపని కోసం అడ్డా మీదికి వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఆమె భర్త దశరథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎన్. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అలాగే సంగారెడ్డి పట్టణంలోని మార్క్సనగర్ కాలనీకి చెందిన రాథోడ్ హిరామన్(30) శనివారం నుంచి కనిపించకుండా పోయాడు. శనివారం ఉదయం మేస్త్రీ పని కోసం ఇంటి నుంచి వెళ్లిన హిరామన్ తిరిగి రాలేదు. ఆదివారం ఆయన భార్య రాథోడ్ సంగీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.